107 ఓవర్లలో

అంచనాలు తప్పలేదు.. సంచలనాలు నమోదు కాలేదు! అంతా అనుకున్నట్లే.. రెండో టెస్టు రెండు రోజుల్లోనే ముగిసింది!

తొలి ఇన్నింగ్స్‌లో హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్ సిరాజ్ సత్తాచాటితే.. రెండో ఇన్నింగ్స్‌లో ఆ బాధ్యత బూమ్ బూమ్ బుమ్రా తీసుకున్నాడు. దీంతో సఫారీ జట్టు తక్కువ పరుగులకే చాప చుట్టేయగా.. స్వల్ప లక్ష్యాన్ని మనవాళ్లు మూడు వికెట్లు కోల్పోయి ఛేదించారు. ఫలితంగా కేప్‌టౌన్‌లో టెస్టు గెలిచిన తొలి ఆసియా జట్టుగా టీమిండియా రికార్డుల్లోకెక్కగా..

642 బంతుల్లోనే ముగిసిన ఈ పోరు సుదీర్ఘ టెస్టు క్రికెట్ చరిత్రలో అతి తక్కువ బంతుల్లో ఫలితం తేలిన మ్యాచ్‌గా రికార్డుల్లోకెక్కింది.

మాస్టర్‌మైండ్ ధోనీ తర్వాత దక్షిణాఫ్రికా గడ్డపై టెస్టు సిరీస్ సమం చేసుకున్న భారత కెప్టెన్‌గా రోహిత్ నిలువగా.. బౌలర్లు బెంబేలెత్తించిన చోట మార్క్‌రమ్ ఆణిముత్యంలాంటి శతకంతో అదరగొట్టాడు. మొత్తంగా ఈ పర్యటనలో భారత జట్టు వన్డే సిరీస్ గెలుచుకొని.. టెస్టు, టీ20 సిరీస్‌లను 'డ్రా' చేసుకొని సగర్వంగా ఇంటిబాట పట్టింది!!

బుమ్రా (6/61)

మళ్లీ నంబర్‌వన్

ఈ విజయంతో ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) పాయింట్ల పట్టికలో భారత్ తిరిగి అగ్రస్థానానికి చేరింది. తొలి మ్యాచ్ ఓటమి తర్వాత ఆరో స్థానానికి పడిపోయిన టీమ్‌ఇండియా టాప్‌కు దూసుకెళ్లగా.. దక్షిణాఫ్రికా ఆ తర్వాతి స్థానంలో ఉంది.

తక్కువ ఓవర్లలో ముగిసిన టెస్టుగా రికార్డు

రెండో టెస్టులో భారత్ చరిత్రాత్మక విజయం

జస్ప్రీత్ బుమ్రా సిక్సర్

ఐదు సెషన్‌లలోనే ఖేల్ ఖతం!

కేప్‌టౌన్‌లో గెలిచిన తొలి ఆసియా జట్టు

కేప్‌టౌన్: పేస్‌కు స్వర్గధామమైన పిచ్‌పై మన బౌలర్లు విజృంభించడంతో దక్షిణాఫ్రికా పర్యటనను టీమ్‌ఇండియా విజయంతో ముగించింది. ఇప్పటి వరకు ఆసియా జట్టు టెస్టు విజయం సాధించని కేప్‌టౌన్‌లో రోహిత్ సేన గర్జించింది. తొలి ఇన్నింగ్స్‌లో సిరాజ్ ఆరు వికెట్లతో రెచ్చిపోతే.. ఈసారి ఆ బాధ్యత బుమ్రా తీసుకున్నాడు. ఫలితంగా రెండు రోజుల్లో ముగిసిన పోరులో టీమ్‌ఇండియా 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది. తద్వారా రెండు మ్యాచ్‌ల సిరీస్ 1-1తో సమం అయింది. ఓవర్‌నైట్ స్కోరు 62/3తో గురువారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన దక్షిణాఫ్రికా చివరకు 176 పరుగులకు ఆలౌటైంది. మార్క్‌రమ్ (103 బంతుల్లో 106; 17 ఫోర్లు, 2 సిక్సర్లు) సూపర్ సెంచరీతో కదంతొక్కగా.. మిగిలినవాళ్లు విఫలమయ్యారు. బెడింగ్‌హామ్ (11), వెరినె (9), జాన్సెన్ (11), కేశవ్ (3) ఒకరి వెంట ఒకరు పెవిలియన్‌కు చేరారు. భారత బౌలర్లలో బుమ్రా 6, ముఖేశ్ కుమార్ రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం 79 పరుగుల లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన టీమ్‌ఇండియా..12 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 80 పరుగులు చేసింది. యశస్వి జైస్వాల్ (28) ధనాధన్ షాట్లు ఆడాడు. కెప్టెన్ రోహిత్ శర్మ (16 నాటౌట్) చివరి వరకు నిలిచి జట్టును గెలిపించాడు. సిరాజ్‌కు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కగా.. 'మ్యాన్ ఆఫ్ ది సిరీస్' అవార్డును ఎల్గర్, బుమ్రా పంచుకున్నారు. ఈ మ్యాచ్‌తో టెస్టు కెరీర్‌కు వీడ్కోలు పలికిగిన ఎల్గర్‌కు భారత జట్టు సభ్యులు సంతకాలు చేసిన జెర్సీని ప్రత్యేకంగా బహుకరించారు. ఈ పర్యటనలో భాగంగా మొదట జరిగిన 3 మ్యాచ్‌ల టీ20 సిరీస్ 1-1తో సమం కాగా.. వన్డే సిరీస్‌ను టీమ్‌ఇండియా గెలుచుకున్న విషయం తెలిసిందే.

మార్క్‌రమ్ (106)

సంక్షిప్త స్కోర్లు

దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్: 55; భారత్ తొలి ఇన్నింగ్స్: 153; దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్: 176 (మార్క్‌రమ్ 106; బుమ్రా 6/61, ముఖేశ్ 2/56);భారత్ రెండో ఇన్నింగ్స్: 80/3 (జైస్వాల్ 28; జాన్సెన్ 1/15).

1 టెస్టు క్రికెట్ చరిత్రలో అతి తక్కువ బంతుల్లో (642) ముగిసిన టెస్టు ఇదే. 1932లో ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా మధ్య జరిగిన పోరు (656 బంతుల్లో ముగిసింది) రెండో స్థానంలో ఉంది.

1 కేప్‌టౌన్‌లో దక్షిణాఫ్రికాపై ఒక ఆసియా జట్టు టెస్టు విజయం సాధించడం ఇదే తొలిసారి.

1 దక్షిణాఫ్రికాలో రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ చేసిన మ్యాచ్‌లో భారత్ నెగ్గడం ఇదే తొలిసారి.

2 దక్షిణాఫ్రికా గడ్డపై ధోనీ తర్వాత టెస్టు సిరీస్‌ను 'డ్రా' చేసుకున్న రెండో భారత కెప్టెన్‌గా రోహిత్ నిలిచాడు.

2 ఒక్క బ్యాటర్ కూడా హాఫ్ సెంచరీ చేయకుండా భారత్ టెస్టు మ్యాచ్ గెలువడం ఇది రెండోసారి.

3 రెండు రోజుల్లో ముగిసిన టెస్టుల్లో భారత్ భాగస్వామి కావడం ఇది మూడోసారి. గతంలో అఫ్గానిస్థాన్‌తో (2018లో), ఇంగ్లండ్‌తో (2021లో) మ్యాచ్‌లు కూడా రెండు రోజుల్లోనే ముగిశాయి. ఓవరాల్‌గా టెస్టు క్రికెట్ చరిత్రలో ఇలా జరగడం ఇది తొమ్మిదోసారి.

అరుణకు రజతం

జాతీయ జిమ్నాస్టిక్స్ చాంపియన్‌షిప్

భువనేశ్వర్: అర్టిస్టిక్ జిమ్నాస్టిక్స్ జాతీయ సీనియర్ చాంపియన్‌షిప్‌లో రాష్ట్ర యువ జిమ్నాస్ట్ బుద్దా అరుణారెడ్డి రజత పతకంతో మెరిసింది. గురువారం జరిగిన మహిళల ఫ్లోర్ ఎక్సర్‌సైజ్ ఈవెంట్‌లో అరుణ అద్భుత ప్రదర్శన కనబరిచింది. గతేడాది శస్త్రచికిత్స తర్వాత అరుణ కఠోర శిక్షణతో జాతీయ స్థాయి టోర్నీలో సత్తాచాటింది. మరోవైపు రైల్వేస్ జిమ్నాస్ట్ ప్రణతి దాస్ రెండు స్వర్ణ పతకాలు సొంతం చేసుకుంది. అన్‌ఈవెన్ బార్స్, ఫ్లోర్ ఎక్సర్‌సైజ్ విభాగాల్లో టాప్‌లో నిలిచిన ప్రణతి మహిళల ఆల్‌రౌండ్ విభాగంలో రెండో స్థానం దక్కించుకుంది. ఒలింపియన్ దీపా కర్మాకర్ మూడు పతకాలు ఖాతాలో వేసుకుంది.

సత్తాచాటిన సుహాస్

జాతీయ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్

న్యూఢిల్లీ: ఢిల్లీలోని శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ స్టేడియం వేదికగా జరుగుతున్న 67వ జాతీయ స్కూల్‌గేమ్స్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లో యువ స్విమ్మర్ సుహాస్ ప్రీతమ్ సత్తాచాటాడు. గురువారం జరిగిన బాలుర అండర్-17 100మీటర్ల బ్యాక్‌స్ట్రోక్ విభాగంలో పోటీకి దిగిన సుహాస్ 00.59.24సెకన్ల టైమింగ్‌తో రజత పతకం సొంతం చేసుకున్నాడు. ఇదే విభాగంలో రిషబ్ దాస్, అమన్ వరుసగా స్వర్ణ, కాంస్య పతకాలు దక్కించుకున్నారు. మరోవైపు బాలుర అండర్-17 400మీటర్ల విభాగంలో వర్షిత్ వెండి పతకం కైవసం చేసుకున్నాడు.

అమ్మాయిల పొట్టి పోరు

నేడు భారత్, ఆస్ట్రేలియా తొలి టీ20

నవీ ముంబై: కంగారూలతో వన్డేల్లో పెద్దగా ప్రభావం చూపలేకపోయిన భారత మహిళల జట్టు టీ20 సిరీస్ కోసం సిద్ధమైంది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా శుక్రవారం ఇరు జట్ల మధ్య తొలి పోరు జరగనుంది. ఈ ఏడాది చివర్లో పొట్టి ప్రపంచకప్ జరగనున్న నేపథ్యంలో ఈ సిరీస్ టీమ్‌ఇండియాకు కీలకం కానుంది. ఆస్ట్రేలియాతో వన్డేల్లో వైట్‌వాష్‌కు గురైన హర్మన్‌ప్రీత్ బృందం ఆ పరాజయాలను పక్కన పెట్టి సత్తాచాటాలని భావిస్తున్నది. హర్మన్, స్మృతి, జెమీమా,రిచా, షఫాలీ, పూజ, రాణిస్తే..ఆస్ట్రేలియాపై విజయం సాధ్యమవుతుంది.

నేటి నుంచి రంజీ ట్రోఫీ

న్యూఢిల్లీ: దేశవాళీ ప్రతిష్ఠాత్మక టోర్నీ రంజీ ట్రోఫీ తాజా సీజన్ శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. ఈ టోర్నీలో మొత్తం 5 గ్రూపుల్లో.. 38 జట్లు తలపడుతున్నాయి. భారత టెస్టు జట్టులో చోటు కోల్పోయిన సీనియర్ ప్లేయర్లు అజింక్యా రహానే, చతేశ్వర్ పుజారా వంటి వారితో పాటు.. టీమ్‌ఇండియా గడప తొక్కేందుకు సిద్ధంగా ఉన్న యువ ఆటగాళ్లు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. మయాంక్ అగర్వాల్, అభిమన్యు ఈశ్వరన్, రుతురాజ్ గైక్వాడ్, సర్ఫరాజ్ ఖాన్, అర్జాన్, జైదేవ్ ఉనాద్కట్, మానవ్ సుతార్, తిలక్‌వర్మ వంటి వాళ్లు సత్తా చాటేందుకు సిద్ధమవుతున్నారు. దేశవాళీల్లో పెద్దగా ప్రభావం చూపలేకపోతున్న హైదరాబాద్ ప్లేట్ గ్రూప్ నుంచి పోటీ పడుతున్నది. నాగాలాండ్, మేఘాలయ, సిక్కిం, మిజోరాంతో తలపడనున్నది.

మోటార్‌సైకిల్ వరల్డ్‌కప్‌లో కేఎస్‌జీ

ముంబై: ప్రతిష్ఠాత్మక ఎఫ్ఐఎమ్ మోటార్ సైకిల్ రేసింగ్ ప్రపంచకప్ టోర్నీకి భారత్ ఆతిథ్యమివ్వబోతున్నది. రేసింగ్ రెండో సీజన్ గ్రాండ్ ఫైనల్ నవంబర్‌లో భారత్ వేదికగా జరుగనుంది. ఈ ఎలక్ట్రిక్ మోటార్‌రేసింగ్‌లో మన దేశానికి చెందిన కంకణాల స్పోర్ట్స్ గ్రూపు(కేఎస్‌జీ) భాగం కాబోతున్నది. రానున్న తొమ్మిదేండ్లలో భారత్‌లో లీగ్ నిర్వహణ కోసం ఎఫ్ఐఎమ్ ఎక్స్‌ప్లోరర్‌తో కేఎస్‌జీ గ్రూపు ఒప్పందం కుదుర్చుకుంది.

రామ్‌లల్లా విగ్రహం 17న బహిర్గతం!

పెజావర్ మఠానికి చెందిన విశ్వప్రసన్న తీర్థ స్వామీజీ వెల్లడి

ఉడుపి: అయోధ్యలో నిర్మితమవుతున్న రామాలయంలో ప్రతిష్ఠించే శ్రీరాముని విగ్రహం గురించి ఈ నెల 17న బహిర్గతపరుస్తామని శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ట్రస్టీ, ఉడుపి పెజావర్ మఠానికి చెందిన విశ్వప్రసన్న తీర్థ స్వామీజీ తెలిపారు. బ్లాక్ స్టోన్‌తో రెండు విగ్రహాలను, గ్రానైట్ స్టోన్‌తో ఒక విగ్రహాన్ని అద్భుతంగా తయారు చేసినట్లు తెలిపారు. వీటిలో దేనిని రామాలయంలో ప్రతిష్ఠించాలో నిర్ణయించేందుకు ట్రస్టు సభ్యులంతా ఓట్లు వేశారని చెప్పారు. ఎంపికైన విగ్రహాన్ని సరయూ నదీ జలాలతో అభిషేకం చేస్తామని, అదే రోజున వెల్లడిస్తామని చెప్పారు.

రామాలయం నిర్మాణం డిసెంబర్ నాటికి పూర్తి

శ్రీరామ జన్మభూమిలో నిర్మిస్తున్న రామాలయం ఈ ఏడాది డిసెంబర్ నాటికి పూర్తవుతుందని నిర్మాణ కమిటీ చైర్మన్ నృపేంద్ర మిశ్రా చెప్పారు. ఓ ఇంటర్వ్యూలో గురువారం ఆయన మాట్లాడుతూ, గ్రౌండ్ ఫ్లోర్ నిర్మాణం పూర్తయిందని, మొదటి, రెండో అంతస్థులను పూర్తి చేయవలసి ఉందని చెప్పారు. రామాలయం కనీసం 1,000 సంవత్సరాలు ఉండాలని భక్తులు కోరుకుంటారని, అందుకు అనుగుణంగానే తమ బాధ్యతలు కూడా పెరిగాయని చెప్పారు. రానున్న 4-5 నెలల్లో రోజుకు 75 వేల నుంచి లక్ష మంది వరకు భక్తులు శ్రీరాముడిని దర్శించుకునేందుకు వస్తారని అంచనా అని తెలిపారు.

అయోధ్య ఆలయం వద్ద ఏఐ నిఘా

అయోధ్య ఆలయం వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. కృత్రిమ మేధస్సు (ఏఐ) సాంకేతిక పరిజ్ఞానంతో ఆలయం వద్ద నిఘా చర్యలు చేపట్టేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. 'పైలట్ ప్రాజెక్ట్‌లో భాగంగా కృత్రిమ మేధతో కూడిన నిఘాను రామ మందిరం వద్ద చేపట్టనున్నాం. ఏఐ నిఘా ఉపయోగంపై కొద్ది రోజుల తర్వాత సమీక్ష జరుపుతాం. ఆ తర్వాత ఇక్కడి భద్రత, నిఘాలో భాగస్వామ్యం చేస్తాం' అని పేరు చెప్పడానికి ఇష్టపడని పోలీస్ అధికారి చెప్పారు. మందిరంలో అనుమానాస్పద కదలికలను ఏఐ నిఘా పసిగడుతుందని ఆయన తెలిపారు.

అయోధ్య రామాలయానికి తుది మెరుగులు దిద్దుతున్న కార్మికులు

శ్రీరాముడు మాంసాహారి: ఎన్సీపీ ఎమ్మెల్యే అవద్

షిరిడీ, జనవరి 4: హిందువుల ఆరాధ్య దైవం శ్రీరాముడిపై ఎన్సీపీ శరద్‌పవార్ వర్గానికి చెందిన ఎమ్మెల్యే ఒకరు వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. జంతువులను వేటాడే రాముడు మాంసాహారి అని మహారాష్ట్ర మాజీ మంత్రి, ఎంఎల్‌ఏ జితేంద్ర అవద్ పేర్కొన్నారు. షిరిడీలో జరిగిన కార్యక్రమంలో ఆయన పార్టీ చీఫ్ శరద్ పవార్ సమక్షంలో మాట్లాడుతూ భగవాన్ శ్రీరాముడు 'బహుజన' వర్గానికి చెందిన వారని అన్నారు. అయినా 14 ఏండ్లు అడవిలో జీవించిన వ్యక్తికి శాకాహార భోజనం ఎక్కడ లభిస్తుంది? అని ఆయన ప్రశ్నించారు. ఆయన వ్యాఖ్యలపై బీజేపీ, అజిత్ పవార్ వర్గం నేతలు తీవ్రంగా మండిపడ్డారు. అతడిపై వెంటనే క్రిమినల్ కేసు పెట్టాలని డిమాండ్ చేశారు.

ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం లక్షద్వీప్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా సముద్ర గర్భంలో స్నార్కెలింగ్(సాహసంతో కూడిన ఈత) చేసి అక్కడి పగడపు దిబ్బలను, జీవరాశులను వీక్షించారు.

మోదీ చదువుకున్న బడికి స్టడీ టూర్

న్యూఢిల్లీ: ప్రధాని మోదీ బాల్యంలో చదువుకున్న పాఠశాలను సందర్శించేందుకు కేంద్ర విద్యా శాఖ అవకాశం కల్పించింది. గుజరాత్‌లోని వాద్ నగర్ టౌన్‌లో ఉన్న ఈ పాఠశాలకు ఏడు రోజుల స్టడీ టూర్‌కు వెళ్లేందుకు ముందుగా రిజిస్టర్ చేసుకోవాలని తెలిపింది. తొమ్మిదో తరగతి నుంచి పన్నెండో తరగతి వరకు చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులు తమ పేర్లను నమోదు చేయించుకునేందుకు ఓ పోర్టల్‌ను ప్రారంభించింది.

సెక్స్ కుంభకోణంలో బిల్‌క్లింటన్, ట్రంప్

- మైఖేల్ జాక్సన్, స్టీఫెన్ హాకింగ్ కూడా
- 'ఎప్‌స్టెయిన్ ఫైల్స్'లో 200 మంది పేర్లు

న్యూయార్క్, జనవరి 4: అమెరికాను 2005లో కుదిపేసిన 'ఎప్‌స్టెయిన్ ఫైల్స్' సెక్స్ కుంభకోణం కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. సెక్స్ కుంభకోణంలో ఆ దేశ మాజీ అధ్యక్షులు బిల్‌క్లింటన్, డొనాల్డ్ ట్రంప్‌తోపాటు స్టీఫెన్ హాకింగ్,మైఖేల్ జాక్సన్, ప్రిన్స్ ఆండ్రూ సహా 200 మంది పేర్లు బయటికి వచ్చాయి. ఈ కేసులో లైంగిక నేరస్థుడు జెఫ్రీ ఎప్‌స్టెయిన్ కోర్టుకు తెలిపిన సమాచారాన్ని గతంలో సీజ్ చేశారు. ఆ ఫైల్‌ను తాజాగా న్యూయార్క్ జడ్జి తెరవటంతో అనేక మంది ఆ దేశ ప్రముఖుల పేర్లు బయటికి వచ్చాయి. మొత్తం వెయ్యి పేజీల స్టేట్‌మెంట్లకు గానూ ఇందులో న్యూస్ పేపర్ల కథనాలు, టీవీ డాక్యుమెంటరీలు, ఇంటర్వ్యూలు, బాధితుల వాంగ్మూలాలు ఉన్నాయి. ఈ ఫైల్స్ పూర్తి వివరాలను అప్పట్లో బయటపెట్టలేదు. తాజాగా, జనవరి 1న న్యూయార్క్ కోర్టు సీజ్ పత్రాలను ఒక్కొక్కటిగా బయటపెడుతున్నది. తొలి విడతగా బుధవారం 40 పత్రాలను విడుదల చేసింది. ఇందులో వ్యాపారుల నుంచి రాజకీయ నాయకుల వరకు ప్రముఖుల పేర్లు ఉండటం గమనార్హం. ప్రస్తుతం ఎప్‌స్టెయిన్ ఫైల్స్ అమెరికాను కుదిపేస్తున్నది. పైగా, ఈ కుంభకోణంలో అంతా అత్యున్నత స్థాయి వ్యక్తులే ఉన్నారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.